

రక్త పరీక్షలు చేసేదెలా..?

ప్లేట్‌లెట్స్ తగ్గి పోయాయా..? రక్తం ఎంతశాతం ఉంది..? రక్తంలో ఇన్‌ఫెక్షన్ ఎంత ఉందో తెలుసుకునేందుకు ముందుగా చేసేది సీబీపీ రక్తపరీక్ష. దీంతో పాటు మరికొన్ని రక్తపరీక్షలు కూడా చేస్తారు. కానీ ఈ పరీక్షలు చేసేందుకు అవసరమయ్యే రీఏజెంట్స్ లేవు. వారం రోజులు అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇదిలా ఉండగా సీబీపీ యంత్రాలు సైతం ఏళ్ల తరబడి పాడైపోయాయి. ఇంతటి నిర్లక్ష్యానికి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రి వేదికగా మారటం గమనార్హం.

- పరీక్షల రసాయనాలు (రీఏజెంట్స్) లేక ఇక్కట్లు
- పాడైపోయిన సీబీపీ యంత్రాలు
- ఆలస్యమవుతున్న రిపోర్టులు
- జనరల్ ఆసుపత్రిలో దుస్థితి



పాడైపోయిన సీబీపీ యంత్రాలు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం...



ఆసుపత్రిలోని ల్యాబ్‌లలో రక్తపరీక్షలకు సంబంధించి రీఏజెంట్స్ (రసాయనాలు) లేవనే విషయం నా దృష్టికి రాలేదు. ఆయా విభాగాలకు సంబంధించిన ఇన్‌చార్జిలను పిలిపించి విషయం తెలుసుకుంటాను. పనిచేయని సీబీపీ యంత్రాలను మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తాం. రోగులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

- జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్

మహబూబ్‌నగర్ (వైద్య విభాగం) ఆగస్టు 14: అసలే సీజనల్ వ్యాధుల కాలం. తీవ్ర జ్వరంతో జనం మంచాన పడుతున్నారు. డెంగీ, మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులతో ప్లేట్ లేట్స్ కూడా తగ్గిపోతున్నాయి. రక్తంలో ఇన్‌ఫెక్షన్లు వస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో వ్యాధిని గుర్తించడంతో పాటు ప్లేట్‌లెట్స్ తగ్గిపోయాయా..? రక్తం ఎంతశాతం ఉంది..? రక్తంలో ఇన్‌ఫెక్షన్ ఎంత ఉందో తెలుసుకునేందుకు ముందుగా చేసేది సీబీపీ రక్తపరీక్ష. దీంతో పాటు మరికొన్ని రక్తపరీక్షలు కూడా చేస్తారు. కానీ జనరల్ ఆసుపత్రిలో మాత్రం ఈ పరీక్షలు చేసేందుకు అవసరమయ్యే రీఏజెంట్స్ లేవు. అయిపోయి వారం రోజులు అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇదిలా ఉండగా సీబీపీ యంత్రాలు సైతం పాడైపోయి మూలకు పడ్డాయి. వాటిని బాగు చేసే దిక్కులేదు. దీంతో రిపోర్టులు ఆలస్యం అయ్యి రోగులు నానా ఇబ్బం దులు పడుతున్నారు.

● రీఏజెంట్స్ లేక ఇబ్బందులు...

జనరల్ ఆసుపత్రిలోని ల్యాబ్‌ల్లో రీఏజెంట్స్ లేవు. ముఖ్యంగా అన్ని రోగాలు నిర్ధారించేందుకు అవసరమయ్యే సీబీపీ పరీక్షలకు సంబంధించిన రీఏ జెంట్స్ గత కొన్ని రోజులుగా అయిపోయాయి. అందులో పాథాలజీ విభాగా నికి సంబంధించి స్టెబ్రొలైజర్, సెల్‌ప్యాక్ రసాయనాలు పూర్తిగా అయిపో యాయి. అంతేకాకుండా బ్లడ్ గ్రూపు నిర్ధారించేందుకు చేసే గ్రూపింగ్ (ఎ.బి.డి) కిట్లు, ఈఎస్‌ఆర్ పిపెడ్ కిట్లు కూ డా లేవు. దీంతో పాటు మలేరియా, వైడా ల్, విడిఆర్‌ఎల్, సీఆర్‌పీ టెస్టులు కూడా చేయడం లేదు. ఇందుకు సంబంధించిన రసాయనాలు కూడా లేకపోవడంతో 10 రోజులుగా పరీక్షలు చేయడం ఆపేశారు. అదేవిధంగా మూత్ర పరీక్షలు చేసేం దుకు వినియోగించే యూరిన్ కంటేనర్లు కూడా ప్రభుత్వం పంపిణీ నిలిపివేసింది.

● పనిచేయని సీబీపీ యంత్రాలు

ఆసుపత్రిలోని అన్ని ల్యాబ్‌లలో 5 సీబీపీ యంత్రాలు ఉన్నాయి. అందులో ఐదు పాట్ యంత్రం టీసీఎల్ సెల్‌ప్యాక్ లేకపోవడంతో పనిచేయడం లేదు. అదే విధంగా ఓపీ ల్యాబ్‌లో ఉన్న సీబిపి యం త్రం, సెంట్రల్ ల్యాబ్‌లో ఉన్న 2 సీబీపీ యంత్రాలు గత ఏడాది క్రితం పాడై మూ లకు పడ్డాయి. కాని వాటిని బాగుచేసే నాథుడే కరువయ్యారు. రోజుకు వందల సంఖ్యలో పరీక్షలు చేయాల్సిన పరిస్థితుల్లో కేవలం ఒక్క సీబీపీ యంత్రంతో ఇన్ని పరీక్షలు ఎలా చేయగలరో అధికారులే సమాధానం చెప్పాలి. ప్రస్తుతం మూడు పాట్ యంత్రం మాత్రమే పనిచేస్తుంది. ఒకే యంత్రంపై భారం పడటంతో అదికూడా మొరాయిస్తోంది.



రీఏజెంట్స్ లేకపోవడంతో మూలకు పడ్డ సీబీపీ యంత్రం

● ఆలస్యమవుతున్న రిపోర్టులు...

ఉదయం డాక్టర్లు పరీక్షలు రాసి రోగికి ఇస్తున్నారు. రోగి ల్యాబ్‌లో రక్తనమూనాలు ఇస్తున్నారు. కానీ రిపోర్టులు మాత్రం మరుసటి రోజు వస్తున్నాయి. దీనిని బట్టి ఒక రోగి రిపోర్టుల కోసం మరో రోజు కూడా రావలని వస్తుంది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందుకు ప్రధాన కారణం రీ ఏజెంట్స్ లేకపోవడమే. రసాయనాలు లేకపోవడంతో ల్యాబుల్లో పరీక్షలు చేయకుండా టి హబ్‌కు పంపిస్తున్నారు. అక్కడ పీహెచ్‌సీల నుంచి వచ్చే పరీక్షలు, జనరల్ ఆసుపత్రి నుంచి వచ్చే పరీక్షలు కలిపి తడిసి మోపెడు అవుతున్నాయి. దీంతో రిపోర్టులు ఆలస్యం అవుతున్నాయి. ఇలాంటి కారణాల వలన రోగులు ప్రభుత్వ ఆసుపత్రులకు రావాలంటేనే భయపడుతున్నారు.

చికెన్ వ్యర్థాలపై కొనసాగుతున్న రాద్ధాంతం

- వ్యర్థాల సేకరణకు రూ.15 లక్షల టెండర్
- వ్యతిరేకిస్తున్న వ్యాపారులు
- ఎమ్మెల్యే యెన్నం వద్దకు చేరిన పంచాయితీ



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో చర్చిస్తున్న చికెన్ వ్యాపారులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 14: చికెన్ వ్యర్థాల సేకరణ దందా మామూలుగా లేదు. ఇన్నాళ్లు వ్యర్థాలను తీసుకుని ఏం చేస్తారని అంతా భావించారు. అయితే దీనివెనక పెద్ద దందానే సాగుతుందన్న విషయం స్పష్టమవుతోంది. కొన్నేళ్లుగా గుట్టుగా సాగిన దందాతో అటు వ్యర్థాలు సేకరించేవాళ్ళు ఇటు చికెన్ వ్యాపారులు సొమ్ము చేసుకోగా పురపాలికల ఆదాయాలకు గండి పడింది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలోని పలు మునిసిపాలిటీలలో చికెన్ వ్యర్థాల సేకరణకు టెండర్లు నిర్వహిస్తుండటంతో వీటి వెనక జరుగుతున భాగోతం బయటకు వస్తోంది. ఇదివరకు నామినల్ పద్ధతిలో కొందరికి కట్టబెట్టడంతో వాళ్లే చికెన్ సెంటర్‌లకు డబ్బులు ఇచ్చి వ్యర్థాలు సేకరించి వాటిని కోళ్ళదాన, చేపలకు ఆహారంగా వేసేందుకు విక్రయిస్తూ రూ. లక్షలు గడించేవాళ్లు. ఉమ్మడి జిల్లాలోని పురపాలికలలో వేల సంఖ్యలో ఉన్న చికెన్ సెంటర్ల నుంచి వ్యర్థాల పేరిట రూ.కోట్ల దందా సాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. మహబూబ్‌నగర్ పురపాలికలో రూ.15 లక్షలకు టెండర్ తీసుకోగా, వనపర్తిలో రూ.29.30 లక్షలకు టెండర్ దక్కించుకున్నారు. వనపర్తి కన్నా రెండింతలు పెద్దదైన పాలమూరు పురపాలికలో అందులో సగం మాత్రమే టెండర్ వేయడంతో ఇప్పుడు ఇక్కడ గుట్టుగా టెండర్ వేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జడ్చర్లలో కేవలం రూ.75 వేలకే రెన్యూవల్ చేసుకున్నారు.

● టెండర్లను వ్యతిరేకిస్తున్న వ్యాపారులు

చికెన్ వ్యాపారులు టెండర్‌లను వ్యతిరేకిస్తున్నారు. ఇదివరకు టెండర్ విధానం ఉండేది కాదు. ఒక్కో మునిసిపాలిటీలో ఒకరిద్దరు చికెన్ సెంటర్లు తిరిగి తూకం బట్టి డబ్బులు చెల్లించి వ్యర్థాలు సేకరించే వాళ్లు. వ్యర్థాల ద్వారా వచ్చే డబ్బులు షాప్‌లో పనిచేసే సిబ్బంది జీతాలు, రెంట్, కరెంట్ బిల్లులు చెల్లించుకునే వాళ్లమని, ఇప్పుడు టెండర్లు వేస్తే మునిసిపాలిటీకి ఆదాయం వస్తుందని టెండర్ తీసుకున్న కాంట్రాక్టర్ తమకు ఇదివరకు ఇచ్చినట్లుగా వ్యర్థాలకు డబ్బులు ఇస్తారా? లేదా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు పెద్దవ్యాపారులు ఏడాదికి రూ.లక్షల్లో వ్యర్థాలకు అగ్రిమెంట్‌లు కూడా చేసుకున్నారని తెలుస్తోంది. టెండర్‌దారులు మాత్రం గతంలో మాదిరిగానే డబ్బులు ఇచ్చి తీసుకెళతామని చెబుతున్నా వ్యాపారుల్లో మాత్రం ఆందోళన నెలకొని ఉంది. ఇదే విషయమై బుధవారం పాలమూరులో చికెన్ వ్యాపారులు పలువురు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు.

పరిశీలించి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. మునిసిపాలిటీ మాత్రం టెండర్ వేయడం వల్ల తమకు ఆదాయం వస్తుందని ఇదివరకు ఈ మాత్రం ఆదాయం కూడా వచ్చేది కాదని చెబుతోంది.

పంద్రాగస్టుకు పరేడ్ మైదానం ముస్తాబు

- వేడుకలకు ముఖ్య అతిథిగా ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ బదావత్ సంతోష్
- విద్యుద్దీపాలంకరణతో కూడళ్లకు కొత్తశోభ

నాగర్‌కర్నూల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జెండా పండుగకు సర్వం సిద్ధమైంది. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమైంది. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న పంద్రాగస్టు వేడుకలకు ప్రణాళిక సంఘం జిల్లా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనున్నారు. వేడుకలను ఘనంగా నిర్వహించడానికి కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం మధ్యాహ్నం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గురువారం ఉదయం 9గంటల నుంచి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు ప్రారంభమవుతాయి. 9:55గంటలకు ఇక్కడికి చేరుకోనున్న ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి 10గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగిస్తారు. 78వ స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు వివిధ శాఖల అభివృద్ధిని సూచిస్తూ శకటాలను కూడా ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని స్వాతంత్ర్య సమరయోధు లకు ఘనంగా సన్మానం చేయనున్నారు. జిల్లా కేంద్రంలో ఆయా కూడళ్లల్లో విద్యుద్దీపాలంకరణ చేశారు.



పోలీస్‌పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

రంగసముద్రం నుంచి నీటి విడుదల

- గేట్లు ఎత్తి నీటిని కిందకు వదిలిన మంత్రి జూపల్లి కృష్ణారావు

శ్రీరంగాపురం, ఆగస్టు 14: భీమా ప్రాజెక్టు అంతర్భాగమైన రంగ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 16వ ప్యాకేజీ ప్రధాన కాలువకు సాగునీరు విడుదల చేశారు. శ్రీరంగాపురం గ్రామ సమీపంలో ఉన్న రం గసముద్రం కాలువకు మంత్రి జూపల్లి కృష్ణారావు పూజలు నిర్వహించి గేట్లను ఎత్తారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 16వ ప్యాకేజీ కాలు వకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు విడుదల చేయాలని భీమా అధికారులకు ఆదేశించారు. దీనికింద 1600 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటిని విడుదల చేయాలన్నారు. ఈ కాలువకు ఇటీవల పూడిక పనులు పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగ సముద్రంలో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయాలని అధికారులను ఆదేశించారు. భీమా ప్రాజెక్టు ఎస్సీ సత్య శిలారెడ్డి, ఈఈ కేశవరావు, డిప్యూటీ ఇంజనీర్లు కిరణ్‌కుమార్, రాజ్‌కుమార్, ఇంజనీర్లు దేవరాజు, కిరణ్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, నారాయణరెడ్డి, రామచంద్రరెడ్డి, బాల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరిరాజు, నాయకులు అంజి, వెంకటేష్, శివసాగర్, రాజావర్దన్ తదితరులు పాల్గొన్నారు.



రంగసముద్రం గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్న మంత్రి జూపల్లి

నేనేమి చేశాను పాపం

- గొంతు నులిమి ఏడేళ్ల బాలుడిని చంపిన మామ
- తల్లితో వివాహేతర సంబంధమే కారణం
- పోలీసుల అదుపులో నిందితుడు



హత్యకు గురైన బాలుడు రఫీ మృతదేహం



రఫీ (ఫైల్)

ఎర్రవల్లి, ఆగస్టు 14 : అమ్మా.. నీ భుజం మీదెక్కి గంతులేస్తుంటే బరువు అనుకోకుండా బాధ్యతలు నేర్పుతున్నావని అనుకున్నా.. చేయి పట్టుకొని నడిపిస్తుంటే జీవితపు బాట నేర్పుతున్నావని అనుకున్నా... ఐస్ క్రీం, చాక్లెట్లు కొనిచ్చి నేను తింటుంటే మైమరచిపోయావు... నా ముద్దు చేష్టలు, మాటలతో ఎంత ప్రేమగానో తన్మయం చెందావు. కానీ నీవు చేసిన తప్పునకు నేను శిక్ష అనుభవించాను.

తల్లి చేసిన పాపానికి మామ అయిన మేనత్త భర్త కర్కశత్వంతో ఏడేళ్ల బాలుడిని గొంతునులిమి దారుణ హత్యచేసిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం మునుగాల గ్రామంలో చోటుచేసుకున్నది.

అలంపూర్ సీఐ రవిబాబు కథనం ప్రకారం.. నజీర్, సమీరా దంపతుల పెద్ద కుమారుడు రఫీ (7) మంగళవారం ఇంటి దగ్గర ఉండగా తల్లి సమీరా కూలి పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చింది. చీకటి పడినా తన పెద్ద కుమారుడు ఇంటికి రాకపోవడంతో గ్రామంలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. అనంతరం ఇటిక్యాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అదే రాత్రి గ్రామానికి వెళ్లిన ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ కూడా తన సిబ్బందితో అర్ధరాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం కనిపించలేదు. బుధవారం సీఐ కూడా వెళ్లి గ్రామంలో విచారణ చేపట్టడమే కాకుండా బాలుడి ఇంటికి అతి సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో కూడా గాలింపు చర్యలు చేశారు. చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు అనుమానితులుగా గుర్తించిన మామ మౌలాలి, తండ్రి నజీర్‌ను అదుపులోకి తీసుకొని తనదైన శైలిలో విచారణ చేపట్టారు. దీంతో మౌలాలి తాను చేసిన అఘాయిత్యాన్ని ఒప్పుకున్నాడు. బాలుడి తల్లి సమీరాతో గతంలో తనకు వివాహేతర సంబంధం ఉండేదని, ఆమెకు చాలా సార్లు డబ్బులిచ్చానని, ఆమె భర్త నజీర్‌కు కూడా రెండు లక్షలు అప్పుగా ఇచ్చానని చెప్పాడు. అయినా సమీరా ఈ మధ్యకాలంలో తనతో సఖ్యతగా ఉండటంలేదని, మరొకరితో వివాహేతర సంబంధం నెరుపుతున్నట్లు కసి పెంచుకున్నాడు. ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడికి మౌలాలి మాయ మాటలు చెప్పి తన బైక్‌పై ఎక్కించుకొని ఇటిక్యాల మండలం శివనంపల్లి గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. అక్కడే గొంతు నులిమి హత్య చేశాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రవిబాబు, ఎస్ఐలు వెంకటేష్, స్వాతి శ్రీనివాస్‌లు బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బాలుడి మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఇదిలాఉండగా మంగళవారం బాలుడి తండ్రి, నిందితుడు కలిసి మద్యం సేవించినట్లు గ్రామస్థులు తెలిపారు.

దాడి చేసి దారి దోపిడీ


అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 14 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని స్కందకాలనీకి వెళ్లే మార్గంలో దారి డోపిడీ జరిగినట్లు ఉండవల్లి ఎస్ఐ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శాంతినగర్ పట్టణానికి చెందిన కె. వీరేష్ అలంపూర్ చౌరస్తా సమీపంలోని ఉత్తరఫీడ్స్ కంపనీలో పని చేస్తూ స్కందకాలనీలో నివసిస్తున్నారు. అతడి బంధువు మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లారు. సాయంత్రం తొమ్మిది గంటల సమయంలో ద్విచక్రవాహనంపై కాలనీకి తిరిగి వస్తుండగా, స్కూటీపై ముగ్గురు, బైక్‌పై ఇద్దరు అడ్డుకొని, ఫోన్ లాక్కునేందుకు ప్రయత్నించడంతో అతడు ప్రతిఘటించాడు. దీంతో అతడిపై దాడి చేసి మొబైల్ ఫోన్, ఎనిమిది వేల రూపాయలు, వెండి గొలుసును లాక్కొని వెళ్లిపోయారు. బాధితుడు ఉండవల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 14 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని డీ బూడిదపాడు శివారులో రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రవి అనే కానిస్టేబుల్ బ్లూకోట్ డ్యూటీ నిర్వహిస్తూ, ఉండవల్లి మండల కేంద్రం నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ఆటోను తనిఖీ చేశాడు. అందులో అనుమతి లేకుండా తరలిస్తున్న ఎనిమిది క్వింటాళ్ల రేషన్‌బియ్యం ఉండటంతో స్టేషన్‌కు తరలించారు. దీనికి సం బంధించి కర్నూలుకు చెందిన కుర్వవిజయ్, శాంతప్పలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జూరాల ప్రాజెక్టు భద్రతపై సందేహాలు

- పలు గేట్లలో లీకేజీలు
- టీబీ డ్యాం మాదిరిగా జూరాలకు పొంచి ఉన్న ముప్పు?
- మరమ్మతు లేక తుప్పు పట్టిన క్రస్ట్ గేట్లు


జూరాల ప్రాజెక్టు ఓ గేట్ ద్వారా లీక్ అవుతున్న నీరు

అమరచింత, ఆగస్టు 14 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న జూరాల ప్రాజెక్టు భద్రతపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఎగువ నుంచి పూర్తిగా వరద తగ్గడంతో జూరాల గేట్లను అధికారులు మూసివేశారు. దీంతో జూరాల ప్రాజెక్టు 62 గేట్లను మూసివేసినప్పటికీ 10 నుంచి 12 గేట్లల్లో లీకేజీలు ఏర్పడడంతో ఆందోళన కలిగిస్తోంది. మొదటి నుంచి ఇంజనీరింగ్ నిపుణులు మరమ్మతులు చేయాలని చెప్తు వస్తున్నప్పటికీ సాంకేతిక కారణాల వల్ల పూర్తిస్థాయిలో గేట్లకు మరమ్మతులు అధికారులు చేయలేకపోయారన్న విమర్శలు ఉన్నాయి. ఈ మధ్యనే తుంగభద్ర డ్యామ్ 19వ గేట్ కొట్టుకపోవడంతో జూరాల ప్రాజెక్టు భద్రతపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు గేట్లలో తుప్పు పట్టి లబ్బర్లు ఊడిపోయి లీకేజీలు ఏర్పడుతున్నాయి. గతంలో సైతం జూరాల ప్రాజెక్టు ప్రధాన రూప్ వైరు తెగి షట్టర్ ఒరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. 2021లో అప్పటి ప్రభుత్వం గేట్ల మరమ్మతు కోసం ఆదేశించిన సాంకేతిక సమస్యల కారణంగా ఐదు నుంచి ఆరు గేట్లు మాత్రమే మరమ్మతు చేసినట్లు తెలిసింది. ఏది ఏమైనా జూరాల ప్రాజెక్టు గేట్ల ద్వారా నీరు లీక్ అవుతుండడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు ఈఈ జుబేర్ అహ్మద్‌ను వివరణ కోరగా పలు గేట్లలో లీకేజీ అవుతున్న విషయం వాస్తవమేనని, లబ్బర్‌లు ఊడిపోవడం వల్ల ఇలాంటి లీకేజీలు సహజంగా ఏర్పడతాయని, ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తామని చెప్పుకొచ్చారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

గోపాల్‌పేట, ఆగస్టు 14 : రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు పీఈటీ తెలిపారు. పాఠశాలకు చెందిన ప్రణవి, మీనాక్షి, గీత, శిరీష, మాధవి, శైలజ, స్వరూపలు ఈనెల 16వ తేదీన నిజామాబాద్ జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ పోటీలో వనపర్తి జిల్లా జట్టు తరుపున ఆడుతారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను హెచ్‌ఎం రమాకాంత్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

గోపాల్‌పేట, ఆగస్టు 14 : ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక హనుమండ్లగడ్డ కాలనీకి చెందిన వల్లెపు కురుమయ్య, రాములమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు ఉండగా, ముగ్గురికీ వివాహాలు జరిగాయి. చిన్న కుమారుడు వల్లెపు రవి(35) పదేళ్ల క్రితం ఇదే గ్రామానికి చెందిన కలమ్మతో వివాహం జరిపించారు. రెండు సంవత్సరాలుగా భార్యాభర్తలు తరచూ గొడవలు పడుతూ వేర్వేరుగా ఉంటున్నారు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రవి పంచెతో ఉరి వేసుకున్నాడు. ఇంటి తలుపులు దగ్గరికి వేసి ఉండడంతో సోదరుడు వెళ్లి చూడగా అప్పటికే రవి మృతి చెందాడు. ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

18న అప్రెంటిస్‌షిప్ మేళా

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 14 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాల ఆవరణలో ఈ నెల 18న అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ ఒక ప్రకటనలో తెపారు. మేళాకు వచ్చే విద్యార్థులు ఎస్‌ఎస్‌సీ మెమో, ఇంటర్మీడియట్ మెమో, ఆధార్‌కార్డు, జిరాక్స్ కాపీలను మూడు సెట్లను తీసుకొని రావాలని తెలిపారు. 2021-2022, 2022-2023, 2023-2024 విద్యా ఏడాదిలో ఒకేషనల్ కోర్సులు ఉతీర్ణులైన విద్యార్థులు ఈ అప్రెంటిస్‌షిప్ మేళాకు హాజరుకావాలని తెలిపారు.

చేపపిల్లల టెండర్ల ఖరారుకు రంగం సిద్ధం

- 1.78కోట్ల చేపపిల్లలు పంపిణీకి నిర్ణయం
- నాలుగేళ్లు వరుసగా ఒక్కరికే టెండర్లు

గద్వాల, ఆగస్టు 14 : జిల్లాలో చేపపిల్లల పంపిణీకి రంగం సిద్ధం అయ్యింది. ఇందుకోసం నిర్వహించిన టెండర్లను బుధవారం ఓపెన్ చేశారు. ప్రీ బిడ్ తెరిచి పరిశీలన పూర్తి చేశారు. ఆ తర్వాత ఫైనాన్సియల్ బిడ్ తెరుస్తారు. తక్కువగా కోట్ చేసిన వారికి నెగోషియేషన్ కమిటీ టెండర్‌ను ఖరారు చేస్తుంది. గత నాలుగేళ్లుగా ఒక్కరికే టెండర్ దక్కుతూ వచ్చింది. ఈ ఏడాది కూడా శివగణి ఫిషరీష్ (గద్వాల), రాజా ఫిషరీష్ (ఖమ్మం)తో పాటు వనపర్తికి చెందిన ప్రకాష్ పాల్గొన్నారు. ప్రీ బిడ్ ఓపెన్ చేయగా, ఇద్దరికే అర్హత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ ఇద్దరిలో ఎవరు తక్కువ కోట్ చేస్తే వారికే టెండర్ దక్కే అవకాశం ఉంది.

ఫైనాన్షియల్ బిడ్ తర్వాత ఖరారు అవుతుంది

చేపపిల్లల పంపిణీకి టెండర్లు పిలిస్తే రెండు సార్లు ఎవరరాలేదు. మూడవసారికి ముగ్గురు టెండర్ వేశారు. ప్రీబిడ్ పరిశీలన పూర్తయ్యింది. ఫైనాన్షియల్ బిడ్ ఖరారు చేయడానికి అనుమతులు రావాల్సి ఉంది. దానిని కూడ త్వరలో పూర్తి చేస్తాం.

- షకీలాబాను, జిల్లా మత్స్యశాఖ అధికారి

టెండర్ ప్రక్రియ ఇలా జరిగింది

జిల్లాలో 1.78 కోట్ల చేపపిల్లను సరఫరా చేయడానికి గత జూలైలో నోటిఫికేషన్ జారీ చేశారు. జూలై 23న టెండర్లు తెరవాల్సి ఉండగా, ఎవరు పాల్గొనకపోవడంతో ఆగస్టు రెండవ తేదీకి వాయిదా వేశారు. అప్పటికి కూడా ఎవరు టెండర్‌ను దాఖలు చేయలేదు. దీంతో మళ్లీ టెండర్లను ఆహ్వానించారు. చివరి తేదీ ఆగస్టు 13గా నిర్ధారించారు. మూడవ సారి గత ఏడాది దాఖలు చేసిన వారితో పాటు మరో కొత్త వ్యక్తి టెండర్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఆయన టెక్నికల్ బిడ్‌లో అర్హత సాధించకపోవడంతో ఇద్దరే మిగిలారు.

1.78కోట్ల పిల్లలకు రూ.2.44కోట్ల విలువ

జిల్లాలో 1.78కోట్ల ఉచిత చేపపిల్లల పంపిణీ చేయడానికి టెండర్లను ఆహ్వానించారు. ఈ టెండర్ విలువ రూ.2.44 కోట్లు ఉంటుంది. ఇందులో 35 - 40 మిలీమీటర్ల చేపపిల్లలు 43.71 లక్షలు ఉంటాయి. 80 -100 మిల్లీమీటర్ల చేపపిల్లలు 1.34 కోట్లు పంపిణీ చేసేందుకు అధికారులు ప్రణాళికలను తయారు చేశారు. చిన్న సైజు చేపపిల్లలు ఒకటి 61 పైసలు కాగా, పెద్ద సైజు చేపపిల్లలు ఒకటి రూ. 1.63 చొప్పున ధర నిర్ణయించారు.

చేపపిల్లల విడుదల ఇలా...

జిల్లాలో 91 మత్స్యకార సహకార సంఘాలు ఉన్నాయి.


ఉచిత చేపపిల్లలను చెరువులోకి విడుస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు (ఫైల్)

నీటి వనరులను మూడు భాగాలుగా విభజించారు. అందులో చెరువులు, కుంటలు 411 వరకు ఉన్నాయి. ఈ ఏడాది వాటిలో 43.71 లక్షల (35 నుంచి 40ఎంఎం) చేప పిల్లలను విడుదల చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. అదేవిధంగా ఆరు నోటిఫైడ్ చెరువులతో పాటు నెట్టంపాడు ప్రాజెక్టు కింద గూడెందొడ్డి, ర్యాలంపాడు, సంగాల, తాటికుంట, నాగర్‌దొడ్డి రిజర్వాయర్లతో పాటు జూరాల కింద జములమ్మ రిజర్వాయర్, శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో 1.34 కోట్ల (80 నుంచి 100ఎంఎం) చేప పిల్లలను విడుదల చేయడానికి సిద్ధం అయ్యారు. బొచ్చ, రౌ, మిడిగాల, మృగాల, రొయ్యలు తదితర రకాల చేప పిల్లలను నీటి వనరులను బట్టి వదలడానికి ప్రణాళికలను సిద్ధం చేసింది.

మెరుగైన వసతుల కల్పనకు కృషి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు డాక్టర్ హుసేన్ నాయక్

మన్ననూర్, ఆగస్టు14: రాష్ట్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేయనున్నట్లు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు డాక్టర్ హుసేన్ నాయక్ తెలిపారు. బుధవారం సాయంత్రం అమ్రాబాద్ మండలం మన్ననూరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలోని వంటశాల, విద్యార్థుల బసచేసే డార్‌మెట్రీలు, మూత్రశాలలు, మరుగుదొడ్లు తదితర వసతులను పరిశీలించారు. ఇరుకైన గదుల్లో 50 మంది విద్యార్థులు ఒకే చోట నిద్రిస్తూ ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. ఒక గదిలో 15 మందికి మించి విద్యార్థులు ఉండరాదని , తక్షణమే ఏర్పాట్లు చేయాలని వార్డెన్ తిరుపతమ్మకు సూచించారు. హాస్టల్‌లో కోతుల బెడద ఉందని, సోలార్ ఫెనిషింగ్ ఏర్పాటు చేయాలని వార్డెన్ కోరారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి ఒక్కొక్కటిగా సమస్యలను తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో 20 మంది ఉపాధ్యాయులకు 10 మంది సీఆర్‌టీలతోనే నడుస్తోందని, గణితం, బయాలజీ ఉపాధ్యాయులను నియమించాలని, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని, తరగతి గదుల్లో బెంచీలను ఏర్పాటు చేయాలని, డైనింగ్ హాలును విశాలంగా ఉండేలా చూడాలని, సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో ఉన్న సమస్యలను గుర్తించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయనున్న ట్లు తెలిపారు. విద్యార్థులు తెలిపిన సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు రాష్ట్ర గిరిజన ఉన్నతాధికారు లతో మాట్లాతానన్నారు. కార్యక్రమంలో జాతీయ ఎస్టీ కమిషన్ డైరెక్టర్ మరీనా, భాజపా జిల్లా కార్యదర్శి నాగరాజు, భాజపా నాయకులు ధర్మనాయక్, రాజు, శాంతి కుమార్, శేఖర్ , గిరిజన సంఘం నాయకులు గోపాల్ నాయక్, శ్రీను నాయక్, జైపాల్ నాయక్ పాల్గొన్నారు.


ఆశ్రమ పాఠశాల వంటగదిని పరిశీలిస్తున్న డాక్టర్ హుసేన్ నాయక్

డీటీడీవో కార్యాలయాన్ని మన్ననూరులోనే నిర్వహించాలి

గిరిజనులకు స్థానికంగా అనుకూలమైన వాతావరణంలో నిర్మించిన డీటీడీఓ కార్యాలయాన్ని అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోనే నిర్వహించాలని జిల్లా గిరిజన సంఘం నాయకులు , బీజేపీ నాయకులు ఎస్టీ కమిషన్ సభ్యుడు డాక్టర్ హుసేన్ నాయక్‌కు విన్నవించారు. ఐటీడీఏ కు రెగ్యూలర్ పీఓను నియమించాలని కోరారు. అమ్రాబాద్ కోదండరామాలయం భూములు ఆక్రమణకు గురయ్యాయని, ఆ భూములపై విచారణ చేయించాలని బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. నాగర్‌కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, ఈ ప్రాంత గిరిజనులు , ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి సమస్యల పరిష్కారానికి సమీక్షలో చర్చిస్తానన్నారు. కార్యక్రమంలో గిరిజన జాతీయ సెన్సార్ బోర్డు సభ్యులు శ్రీను నాయక్, పత్య నాయక్, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జైపాల్ నాయక్, సంఘం నాయకులు గోపాల్ నాయక్, బాలునాయక్, చత్రూనాయక్, చందు నాయక్, పర్వతాలు, బాలకృష్ణ పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

మహమ్మదాబాద్/ గండీడ్, ఆగస్టు 14 : ఉమ్మడి మండల పరిధిలోని పలు గ్రామాల్లో నాటు సారా కాస్తున్న స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. మహమ్మదాబాద్ మండల పరిధిలోని బొమ్మికుంట తండా, కొలిమికుచ్చతండా, సాముల బండతండా, మంగపేట తండా, కనికుల కుచ్చతండా, మదరమీదితండా, వనుకుల తండా గండీడ్ మండల పరిధిలోని పంచగుల తండా, జంగరెడ్డిపల్లి తండాలో మహబూబ్‌నగర్, వికారాబాద్ ఎక్సైజ్ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. సారా కాస్తున్న, అమ్ముతున్న వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. జంగంరెడ్డి పల్లితండాలో 150 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 10 కేజీల నల్లబెల్లం సీజ్ చేశారు. నలుగురిపై కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ బాలకృష్ణ, ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

వంగూరు మండలంలో ..

వంగూరు, : మండలంలోని రంగాపూర్‌తండా, అన్నారం తండాల్లో బుధవారం కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకటొరెడ్డి, డీటీఎఫ్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. నాలుగు వందల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. రంగాపూర్ తండాకు చెందిన రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

భూవివాదంలో ఇరు వర్గాలపై కేసు నమోదు

చారకొండ, ఆగస్టు 14: నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రంలోని సర్వే నెంబరు 778లో గల భూవివాదంలో ఇరువర్గాలకు చెందిన చింతపల్లి వెంకటమ్మ, గోరటి లక్ష్మయ్య ఘర్షణ పడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బుధవారం ఇన్‌చార్జి ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.

22న డాక్టర్ల నియామకానికి మౌఖిక పరీక్షలు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), ఆగస్టు 14 : ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేందుకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, జూనియర్ రెసిడెంట్ డాక్టర్ల నియామకాలకు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. దరఖాస్తు ఫారాలు, ఖాళీల వివరాల కోసం ప్రభుత్వ వైద్యకళాశాల మహబూబ్‌నగర్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 14 : జిల్లా కేంద్రంలోని బీఎడ్ కళాశాలలో ఖాళీగా వివిధ సబ్జెక్టులకు బోధించేందుకు లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరాజులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం సాంఘిక శాస్త్రం, గణితం, తెలుగు, హిందీ, ఉర్దు, ఐసీటీ, ఆరోగ్య వ్యాయామ, విజువల్, ఆర్ట్స్, జనరల్ సబ్జెక్టుల పోస్టులకు సంబంధించి రిటైర్డ్ ఉపాధ్యాయులు, రిటైర్డ్ అధ్యాపకులు ఈ నెల 21 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు రిటైర్డ్ అధ్యాపకులు అయిఉండి పీజీతో పాటు ఎంఈడీ, పీహెచ్‌డీ, ఎంపీఈడీతో పాటు నెట్, సెట్ కల్గి ఉండాలన్నారు. బీఎడ్ కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

దొంగకు ఎనిమిది నెలల జైలు శిక్ష

కొత్తకోట, ఆగస్టు 14 : ద్విచక్ర వాహనం దొంగతనం కేసులో దొంగకు ఎనిమిది నెలల జైలుశిక్ష పడినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఏప్రిల్ నెలలో వనపర్తి జిల్లా కొత్తకోటలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన శ్రీనివాస్ ఇంటి ఆవరణలో ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఓ దొంగ ఎత్తుకెళ్లాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై విచారణ చేపట్టి దొంగను గుర్తించారు. హైదరాబాద్ జైపూరికాలనీ, నాగోల్, సరూర్‌నగర్‌కు చెందిన అనూప్‌కుమార్ అలియాస్ టింకు అలియాస్ నితేష్ అలియాస్ రాజు(31) నుంచి వాహనాన్ని స్వాధీనం చేసుకొని దొంగను ఆత్మకూర్ కోర్టులో ప్రవేశ పెట్టారు. పీపీ అరుణోదయకుమార్ వాదనలు విన్న న్యాయమూర్తి శిరీష దొంగకు ఎనిమిది నెలల శిక్షతో పాటు రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై చెప్పారు. దొంగకు శిక్ష పడినందున కోర్టు కానిస్టేబుల్ తిరుపతయ్యను ఎస్సై అభినందించారు.

విద్యార్థిని చితక బాదిన ఉపాధ్యాయుడు

- పాఠశాలను పరిశీలించిన డీఈవో రవీందర్


విచారణ చేస్తున్న డీఈవో రవీందర్, ఎంఈవో మంజూల

జడ్చర్ల ఆగస్టు 14 : జడ్చర్ల మండలం పోలేపల్లిలోని నవోదయ పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న విద్యార్థిని జస్వితను అకారణంగా పాఠశాల ఉపాధ్యాయుడు చితకబాదాడు. కర్రతో కొట్టడంతో వీపు, చేయి, ముఖంపై వాతలు పడ్డాయి. బుధవారం పాఠశాలకు వచ్చి తరగతి గదిలో కూర్చున్న జస్వితను సరిగా చదవడం లేదంటూ విచక్షణా రహితంగా కరస్పాండెంట్ రాందాసు చితకబాదాడు. తన కూతురును టీచర్ కొట్టాడన్న సమాచారం తెలుసుకున్న తండ్రి శ్రీనివాస్ పాఠశాలకు వచ్చి ఎందుకు కొట్టావని రాందాస్‌ను నిలదీశాడు. దీంతో సదరు ఉపాధ్యాయుడు దురుసుగా ప్రవర్తించాడని స్థానికులు తెలిపారు. జస్వితపై దాడి చేసిన రాందాసుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. అనంతరం డీఈవో రవీందర్, ఎంఈవో మంజూలతో కలిసి ఆ పాఠశాలకు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను కొట్టడం సరికాదని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, ఈ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చిన్నారులపై దాడులు సరికాదన్నారు.

రైతు ఇంట్లో రూ. 90 వేలు చోరీ

- ఇంటి యజమానిని తోసేసి పారిపోయిన దొంగ

రాజోలి, ఆగస్టు 14 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పచ్చర్ల గ్రామానికి చెందిన రైతు మోజేష్ ఇంట్లో రూ.90 వేలు చోరీకి గురయ్యాయి. రాజోలి ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చెందిన మోజేష్ మంగళవారం ఉదయం పొలానికి వెళ్లి మధ్యాహ్నం 12.40 గంటలకు ఇంటికి వచ్చాడు. ఇంట్లోని బీరువా తెరిచి ఉండటం గమనించి పరిశీలించగా, అందులోని రూ. 90 వేలు నగదు మాయం అయినట్లు గుర్తించాడు. ఆ తర్వాత ఇంట్లో తిరిగి పరిశీలిస్తుండగా, అక్కడే దాక్కొని ఉన్న దొంగ అతడిని తోసేసి పారిపోయాడు. ఈ మేరకు బాధితుడు మోజేష్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తాడూరు, ఆగస్టు 14 : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని మేడిపూర్ గ్రామంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు పరమేశ్(21) చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

వ్యక్తి రిమాండ్‌కు తరలింపు

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 14 : బొలెరోవాహనాన్ని దొంగిలించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వంగూర్ మండలం గాజర గ్రామానికి చెందిన కొమ్ము సైదులు కల్వకుర్తి పట్టణంలోని విజయ డెయిరీ పాలకేంద్రానికి తన బొలేరో వాహనంలో పాలను సరాఫరా చేస్తున్నాడని తన వాహనాన్ని మంగళవారం రాత్రి పాలకేంద్రంలో పాలుపోసి హైదరాబాద్ చౌరస్తాలో నిలిపి ఓ హోటల్‌లో భోజనం చేయడానికి వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని బుధవారం ఉదయం బాధితుడు ఫిర్యాదు చేయాగా సాయంత్రం తనిఖీలు నిర్వహించగా జేపీనగర్ వద్ద కుర్మేటీ అంజనేయులు చారకొండ మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందినవ్యక్తి దొంగిలించి బొలోరె వాహనాన్ని హైదరాబాద్‌లో అమ్మడానికి తీసుకు వెళ్తుండాగా పట్టుకుని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ వివరించారు.

ప్రతీ గ్రామానికి ఆర్టీసీ బస్సు

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, ఆగస్టు14: ప్రతీ మారుమూల గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అమ్రాబాద్ మండల పరిధిలోని బీకే లక్ష్మాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు. అచ్చంపేట నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి బస్సులు సర్వీసులు కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరు కొత్త బస్సులను అచ్చంపేటకు ఇచ్చారన్నారు. త్వరలో మరో పది నూతన బస్సులు అచ్చంపేటకు వస్తున్నాయన్నారు. అదేవిధంగా గ్రామాలలో కరెంట్ లో వోల్టేజ్ సమస్యలు పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. నియోజకవర్గంలో ఆరు కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. అదేవిధంగా అమ్రాబాద్ మండల పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల సెంటర్‌ను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కట్ట అనంత రెడ్డి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

అచ్చంపేట/ఉప్పునుంతల, ఆగస్టు14: ప్రభుత్వ ఆసుపత్రులో మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై సమీక్షా సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు వైద్యసేవలు అందిస్తూ అందుబాటులో డాక్టర్లు ఉండాలన్నారు. అదేవిధంగా అదనపు కలెక్టర్ సీతారామారావు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ఉప్పునుంతల పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిని అకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలపై రోగులను అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

అఖండ భారత్ సాధనే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

- ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ కట్ట ప్రభాకర్ రెడ్డి

అచ్చంపేటటౌన్, ఆగస్టు14: వేల సంవత్సరాలుగా కలిసి ఉన్న భారతదేశ ఖండిత భూభాగాలన్నింటిని కలిపి అఖండ భారత్ సాధనే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ కట్ట ప్రభాకర్ రెడ్డి అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో అఖండ భారత దివాస్ కార్యక్రమం అచ్చంపేటలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంతో కలిసిఉన్న ఆఫ్ఘానిస్తాన్, పాకిస్తాన్, నేపాల్, శ్రీలంక, మయన్మార్, భూటన్ లాంటి దేశాలు సంస్కృతి స్వాభిమానాన్ని కోల్పోవడం వల్ల అవి వేరే దేశాలుగా విడిపోయి మనుగడ సాగించలేని పరిస్థితిలో ఉన్నాయన్నారు. దేశము, ధర్మము పట్ల యువతి యువకులు అవగాహన కలిగి దేశాన్ని రక్షించుకోవాలని సూచించారు. దేశం కోసం ప్రాణాలు విడిచిన స్వాతంత్ర్య వీరుల స్ఫూర్తితో దేశం కోసం పనిచేయాలని సూచించారు. సమావేశంలో విద్యార్థులు వైద్యులు ప్రశాంత్ నాయక్, స్వయం సేవక్ సంఘ్ సభ్యులు వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదగాలి

చారకొండ, ఆగస్టు 14: ముదిరాజ్‌లు అన్నిరంగాల్లో ఆర్థికంగా ఎదగాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాగూర్ బాలాజీసింగ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చంద్రాయన్‌పల్లిలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు సొప్పరి వెంకటయ్య ఆధ్వర్యంలో వారు ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ముదిరాజ్ భవన నిర్మాణం కోసం ఆశాదీప్‌రెడ్డి రూ. 1.50 లక్షలు, బాలాజీసింగ్ రూ. ఒక లక్ష సహాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ సాంబయ్యగౌడ్, ఉపసర్పంచ్ సొప్పరి పర్వతాలు, ముదిరాజ్ సంఘం నాయకులు మాణిక్యం, జమ్ముల శంకర్, శ్రీను, లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నారయ్య, నాయకులు భాస్కర్‌రెడ్డి, శంకర్, నిరంజన్, అల్లాజీ, నరేందర్, జమ్ముల బాలచంద్రి, కొండల్ పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

కల్వకుర్తి, ఆగస్టు 14: దైవచింతనతో మానసిక ప్రశాంతత చేకురుతుందని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకుడు కాయితీ శాదీప్‌రెడ్డి తెలిపారు. కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామానికి చెందిన రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డిని బుధవారం వెల్దండ మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన పోచమ్మ గుడి సభ్యులు కలిశారు. పెద్దాపూర్ గ్రామంలో పోచమ్మగుడి నిర్మాణానికి కాయితీ ఆశాదీప్‌రెడ్డి విరాళం రూ. 20 వేలు దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. సభ్యులు ధ్యాప వెంకట్‌రెడ్డి, కాయితీ జయంత్‌రెడ్డి, గంగాపురం యాదగిరి, నక్క మల్లికార్జున్, జక్కుల మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చేయి చేయి కలిపారు

- పాఠశాల రంగులు వేయించారు

తిమ్మాజిపేట, ఆగస్టు 14 : గ్రామంలో యువకులు ముందుకొచ్చి చేయి చేయి కలుపుకుని దాతల సహకారంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మెరుగులు దిద్దిపెట్టారు. మండల పరిధిలోని మారేపల్లి గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 150మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల అందవికారంగా కనిపిస్తుండటంతో యువకులు ముందుకొచ్చి దాతల సహకారం తీసుకుని దాదాపు రూ. 73వేలు పోగు చేసి పాఠశాల వెలుపల, లోపల రంగులు వేయించినట్లు కూకుంట్ల మల్లేష్ తెలిపారు. పాఠశాలలోని గదులలో దేశ నాయకుల చిత్ర పటాలు కూడా వేయించామని పాఠశాల అభివృద్ధి కోసం సహకారమందించిన దాతలకు మల్లేష్ కృతజ్ఞతలు తెలిపారు.

కార్యకర్తకు అండగా బీఆర్ఎస్ : మాజీ ఎమ్మెల్యే మర్రి

తిమ్మాజిపేట, ఆగస్టు 14 : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తకు అండగా ఉంటుందని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బుద్ద సముద్రం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నూకం నాగరాజు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించాడు. పార్టీ కార్యకర్త కావడంతో ఆయన మంజూరు అయిన రూ. రెండు లక్షల ప్రమాద బీమా చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఎవరు అధైర్యపడవద్దని తాను ఎప్పుడు మీ మధ్య ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జోగుప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌వేణుగోపాల్‌గౌడ్, నాయకులు స్వామి, నర్సిరెడ్డి, ఇబ్రహీం, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

లావాని కమిటీలు పునరుద్ధరించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్‌రాములు

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 14: జిల్లాలో లావాని కమిటీలను పునరుద్ధరించి పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్‌రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు లేక అర్హులైన వారికి బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. భూమి లేని పేదలకు ప్రభుత్వం రూ.12 వేల ఆర్థిక సహాయం తక్షణమే అమలు చేయాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా గ్రామాల్లో కూలీ రేట్లు పెంచాలని, కనీస వేతనాల చట్టాన్ని సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంగం జిల్లా అధ్యక్షుడు చింతం ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, భాస్కర్, చిచ్చన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ రామరాజు సేవలు మరువలేనివి

కొల్లాపూర్, ఆగస్టు 14 : కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఇటికాల రామరాజు సేవలు మరువలేనివని కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పేర్కొన్నారు. బుధవారం బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపాల్ ఇటికాల రామారాజుయాదవ్‌ను ప్రస్తుత ప్రిన్సిపాల్ ఎంఎస్‌ఉదయ్‌కుమార్ అధ్యక్షతన బుధవారం కళాశాల ఆవరణలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజును సన్మానించారు. సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.స్వర్ణలత, అధ్యాపకులు డాక్టర్ రమేష్‌కుమార్, టి.వెంకటయ్య, కుర్మయ్య, సోఫీ పాష, శివుడు, నరసింహ, కేశవులు, బాలు, విష్ణు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో సమస్యల పరిష్కారానికి కృషి

- మహబూబ్‌నగర్ ఆర్ఎం శ్రీదేవి

అచ్చంపేటటౌన్, ఆగస్టు 14: ఆర్టీసీ డిపోలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మహబూబ్‌నగర్ ఆర్ఎం శ్రీదేవి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్మికుల సమస్యలు తమ దృష్టికి వస్తే తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. డిపోలో వెంటనే డ్రైవర్, కండక్టర్ల చార్ట్ వేయాలని సూచించారు. డ్రైవర్లకు స్ప్రింగ్ డ్యామేజ్ విషయంలో రికవరీని నిలుపుదల చేయాలని కార్మికులు కోరారు. ఆర్టీసీ ఆదాయం కోసం కార్మికులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రసాద్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

- నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మైనార్టీ గురుకుల తనిఖీ



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని, వంట గదుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ వంట నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మైనార్టీ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైనార్టీ గురుకుల పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని వంటగది పరిసరాలను, కూరగాయలు, నిత్యావసర సరుకులు, నిల్వ ఉన్న బియ్యం నాణ్యతలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. బియ్యంలో పురుగులు ఉంటే ఎలా శుభ్రం చేస్తారని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న భోజనం పట్ల నిర్లక్ష్యం చేయరాదని నిర్వాహకులకు సూచించారు. ఉపాధ్యాయులు పరిశీలించి విద్యార్థులకు అందించాలని సూచించారు. ఒకవేళ సరఫరా చేసిన బియ్యంలో పురుగులు ఉంటే బియ్యాన్ని వెనక్కి పంపి వెంటనే కొత్త బియ్యాన్ని తెప్పించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని, పాలెం ఆసుపత్రిని కలెక్టర్ పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయి మందులు అందుబాటులో ఉన్నాయా అని వైద్యులను ఆరా తీశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను, మందుల నిల్వ గదులను ల్యాబ్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వైద్యాధికారికి సూచించారు. ఆరోగ్య కేంద్రంలో కాన్పులు ఎక్కువగా జరిగేటట్లు చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉన్నాం

- వీసీలో కలెక్టర్ బదావత్ సంతోష్

జిల్లాలో సీజనల్ వ్యాధులు, డెంగీ, చికున్‌గున్యా ప్రబలకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నామని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో ఆరోగ్యం- సీజనల్ వ్యాధులు-సంసిద్ధత, హాస్టల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్ పరిస్థితులు, స్వచ్ఛదనం- పచ్చదనం పురోగతిలపై వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ నుంచి ఆయా శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి జిల్లా స్థాయి అధికారి హాస్టల్, పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలను విధిగా తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. వసీలో అదనపు కలెక్టర్ సీతారామారావు, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్‌గోపిడీ, డీఎంహెచ్ డబ్ల్యూ స్వరాజ్యలక్ష్మీ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకు సహకారమందిస్తా

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

కందనూలు, ఆగస్టు 14 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు చేసే కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే కాలంలో ప్రోత్సాహకాలను పొందేందుకు విద్యార్థులు పోటీ పడి విద్యనభ్యసించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ప్రోత్సహించడంతోపాటు పాఠశాలకు సౌకర్యాలు కల్పిస్తున్న క్లాస్‌మేట్ క్లబ్‌లో తాను సభ్యుడిగా చేరుతానని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని విద్యార్థులు చెట్ల కింద విద్యనభ్యసిస్తున్నారని త్వరలో నూతన భవన నిర్మాణాలకు శంఖుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన పథకంలో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుతోపాటు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్, కౌన్సిలర్లు కావలి శ్రీను, సునేంద్ర, బుచ్చన్నయాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ సంపదను కార్పొరేట్‌కు దోచిపెడుతున్న కేంద్రం

- సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్ నరసింహ విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్ నరసింహ

బిజినేపల్లి, ఆగస్టు 14 : దేశ అభివృద్ధికి తిలోదకాలిచ్చిన కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా దోచిపెడుతోందని నాగర్‌కర్నూల్ జిల్లా సీపీఐ కార్యదర్శి బాల్‌నరసింహ విమర్శించారు. మండల కేంద్రంలోని ఎంజేఆర్ గార్డెన్‌లో బుధవారం సీపీఐ మండల కార్యదర్శి పులిదండ కృష్ణాజీ ఆధ్వర్యంలో మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. దేశ స్థూల జాతీయోత్పత్తి పెరుగుదలను కాగితాల్లో చూపుతున్న బీజేపీ ప్రభుత్వం క్షేత్రస్థాయిలోని పేదల బతుకుల్లో మార్పు రాలేదన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా గద్దెనెక్కిన మోదీ సర్కార్ హామీలను బుట్టదాఖలు చేసిందన్నారు. కేంద్రం తెచ్చిన కొత్త చట్టాలతో దేశ వ్యాప్తంగా ప్రజలు మరోసారి స్వతంత్ర పోరాటానికి సిద్ధమవుతున్నారని హెచ్చరించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు గతంలో చేసిన పనులకు మాత్రమే బిల్లులు ఇచ్చానని చెప్పడం కాదని యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టును పూర్తి చేసి పాలమూరు అభివృద్ధికి బాటలు పర్చాలని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈర్ల చంద్రమౌళి, సీపీఐ కౌన్సిల్ సభ్యుడు మంగపేట శ్రీనివాసులు, ఏఐటీయూసీ నాయకుడు చిన్నపాగ శ్రీను, మండల నాయకులు ధనబాబు, నారాయణ, రాములు, మల్లయ్య, సాయిలు, యాదయ్య, మరియమ్మ పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలి



కల్వకుర్తిలో హనుమాన్‌నగర్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు



పెద్దకొత్తపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల ఐక్య వేదిక నాయకులు

కల్వకుర్తిటౌన్/పెద్దకొత్తపల్లి, తిమ్మాజిపేట, ఆగస్టు 14 : బంగాదేశ్‌లో హిదువులపై జరుగుతున్న దాడులు ఆపాలని కల్వకుర్తి హిందూఐక్యవేదిక సభ్యులు అన్నారు. బుధవారం పట్టణంలోని హనుమాన్‌నగర్ నుంచి పాలమూరుచౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. హిందూఐక్యవేదిక సభ్యులు మాట్లాడుతూ భారతదేశంలోని హిందుసమాజం ఐక్యమత్యంగా ఉండి ఇలాంటి సమస్యలపై సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దుర్గాప్రసాద్, కృష్ణగౌడు, రాంభూపాల్‌రెడ్డి, వివేకానంద, బాబిదేవ్, బాలగౌడు, హిందూధార్మిక సంస్థల సభ్యులు పాల్గొన్నారు. పెద్దకొత్తపల్లి మండల పరిధిలో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలకు నిరసనగా హిందూ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ సంఘాల ఐక్య వేదిక నాయకుడు పిరుమాళ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి, కన్వీనర్ పోల కిశోర్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో బంగ్లాదేశంలో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, హోటళ్లు స్వచ్ఛందంగా బంద్‌ను పాటించి మద్దతును తెలిపాయి. హిందూధార్మిక సంఘాల నాయకులు దాచేపల్లి వేణుగోపాల్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు యశ్వంత్, బాల్‌రెడ్డి, గోసుల బాలయ్య, ప్రవీణ్‌కుమార్, యశ్వంత్, లక్ష్మీనారాయణ, మాధవులు, శివ, మల్లేష్ ముదిరాజ్ తదితరులున్నారు.



తిమ్మాజిపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న హిందూధార్మిక, రాజకీయ పార్టీల నాయకులు

మండికారి బాలాజీకి అరుదైన గౌరవం దక్కడం హర్షణీయం

మన్ననూర్, ఆగస్టు14: అంతర్జాతీయ సాహిత్య కవితా పోటీల్లో కవి గాయకుడు మండికారి బాలాజీకి అరుదైన గౌరవం దక్కడం హర్షణీయమని వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంభు వెంకట్‌రమణ, అయ్యప్ప సేవాసమితి గురుస్వామి సంభు శ్రీనివాసులు అన్నారు. దేశ భక్తి పాటలు , భక్తి గేయాలు రచించిన అనుభవం ఉందని, త్వరలోనే ఉమామహేశ్వర క్షేత్ర పురాణం, మహిమలు అనే అంశంపై త్వరలోనే పుస్తకాన్ని రచించనున్నట్లు తెలిపారు.

డీఏలను వెంటనే విడుదల చేయాలి

అచ్చంపేటటౌన్, ఆగస్టు 14: డీఏలను వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జక్క రామస్వామి అన్నారు. మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయులు రత్న ప్రసాద్, జానకీరామ్ పాల్గొన్నారు.

'విజయ డెయిరీ పాల బిల్లులు చెల్లించాలి'

అచ్చంపేట టౌన్, ఆగస్టు14: మండల పరిధిలోని బొమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన పాడి రైతుల నుంచి రోజుకు 500లీటర్ల పాలు విజయ డెయిరీ పాల కొనుగోలు చేస్తుందని గత నాలుగు వారాల నుంచి డబ్బులు చెల్లించడం లేదని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని విజయడెయిరీ మేనేజర్ కృష్ణయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. పాడి రైతులు నిత్యావసర సరుకులు లేక పాల బిల్లునే నమ్ముకుని కొన్ని కుటుంబాలు జీవనం గడుపుతున్నాయని వాపోతున్నారు. వెంటనే పాడి రైతులకు ఇవ్వాల్సిన బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతీ రైతుకు రుణమాఫీని వర్తింపజేయాలి

అమ్రాబాద్, ఆగస్టు 14: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పట్టా పాస్ బుక్ కలిగిన ప్రతీ రైతుకు ఎలాంటి ఆంక్షలు విధించకుండా రైతు రుణమాఫీని వర్తింపచేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు జక్కా బాల కిష్టయ్య బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందని పాస్ బుక్కు కలిగిన ప్రతి రైతు బ్యాంకులో రుణం తీసు కోవాలని పీసీసీ అధ్యక్షులు సీఎం రేవంత్ రెడ్డి రైతుల కు అభయమిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎటువంటి షరత్తులు విధించకుండా ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీని వర్తింపజేసి కాంగ్రెస్ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కార్వంగలో వైద్య శిబిరం విజయవంతం

తెలకపల్లి, ఆగస్టు 14 : మండల పరిధిలోని కార్వంగలోని ఆయుర్వేద హాస్పిటల్ దగ్గర నేషనల్ ఆయుష్ మిషన్ తరపున బుధవారం జీరియాట్రిక్ వయో వృద్ధుల వైద్య శిబిరం నిర్వహించినట్లు జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సురేష్ తెలిపారు. శిబిరంలో వృద్ధుల అన్ని రకాల ఆరోగ్య సమస్యలను పరీక్షించి ఉచితంగా మందులు ఇచ్చారు. శిబిరం విజయవంతంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్, డాక్టర్ మంజుల, డాక్టర్ భానుప్రకాశ్, ఫార్మాసిస్టులు గోవిందు, భాస్కర్, మురళీకృష్ణ, స్థానిక ఏఎన్ఎం ఇంద్ర, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పద్మనపల్లిలో..

లింగాల : మండల పరిధిలోని పద్మనపల్లిలో బుధవారం లింగాల సీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 50మందిని వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్‌టీ.మల్లేష్, ఏఎన్ఎం రాధాబాయి, ఆశా కార్యకర్త జ్యోతి, పంచాయతీ కార్యదర్శి భానుప్రసాద్ పాల్గొన్నారు.

తెలకపల్లి ఎంపీడీవోగా శ్రీనివాస్

తెలకపల్లి, ఆగస్టు 14 : తెలకపల్లి ఎంపీడీవోగా శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కోడేరు మండలంలో పని చేస్తున్న ఆయన తెలకపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కుక్కల బెడద నివారణకు కృషి చేస్తానన్నారు.

కాలువ మరమ్మతు పనులు ప్రారంభం

పెంట్లవెల్లి, ఆగస్టు14: కొల్లాపూర్ మండలం రాంపురం గ్రామంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు కాలువ మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ జిల్లా నాయకులు ఆకునమోని రాముయాదవ్ మాట్లాడుతూ కాలువల మరమ్మతుల కోసం మంత్రి జూపల్లి కృష్ణారావును రైతులంతా కోరగా వెంటనే స్పందించారన్నారు. కాలువలు మరమ్మతులు లేక పోవడంతో శ్రీవారి సముద్రం నుంచి విడుదలయ్యే నీరు వృథాగా పోతుందని వారన్నారు. కాలువ మరమ్మతు చేయడంతో రామాపురం రైతులతో పాటు పెంట్లవెల్లి మండలంలోని పలు గ్రామాల రైతులకు సాగునీరు అందు తుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం శేఖర్, మధు, నల్లవెల్లి చంద్రయ్య, ఉడుత రామస్వామి, వై.రాముడు, ఆకునమోని శరమంద తదితరులు పాల్గొన్నారు. కాగా, పెద్ద కాలువ మరమ్మతు కోసం గతంలో ఎన్నో పోరాటాలు చేశానని టీడీపీ నాయకుడు ఆకునమోని చంద్రయ్య అన్నారు. అడిగిన వెంటనే స్పందించి సమస్య పరిష్కరించినందుకు మంత్రి జూపల్లికి కృతజ్ఞతలు తెలిపారు.

చెంచు మహిళకు పరామర్శ



జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చెంచు మహిళను పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

కందనూలు, ఆగస్టు 14 : నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆదివాసి చెంచు మహిళ తిరుగుడు మశమ్మను సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లాపూర్ మండలంలోని ముక్కిడిగుండం గ్రామంలో జరిగిన ఘటన చాలా బాధాకరమైన విషయమన్నారు. ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మండల కార్యదర్శి మర్యాద వెంకటయ్య, సీపీఐ జిల్లా కౌన్సిల్ మెంబరు మారేడు శివశంకర్, నాగర్‌కర్నూల్ పట్టణ కార్యదర్శి కపలివాయి గోపిచారి తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన మహిళ ఆచూకీ గుర్తింపు

తిమ్మాజిపేట, ఆగస్టు 14 : మండల పరిధిలోని నేరేళ్లపల్లి గ్రామంలో మంగళవారం చెరువులో పడి మృతి చెందిన మహిళ శవాన్ని బాధితకుటుంబ సభ్యులు బుధవారం గుర్తించినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న తంగేళ్ల నరసింహారెడ్డి ఆసుపత్రికి వెళ్లి శవాన్ని పరిశీలించగా తన తల్లి లక్ష్మమ్మని గుర్తించాడు. అనారోగ్యం కారణాల వల్ల చెరువులో పడి మృతి చెందినట్లు మృతురాలి కుమారుడు తెలిపారని పోలీసులు తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 14 : మండల పరిధిలోని వెన్నచెర్ల గ్రామానికి చెందిన వి.శిరీష కుమారుడు జశ్వంత్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద ఎల్‌వోసీని ఆ గ్రామ ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పర్వతాలు, నాయకులు వంగూరు రాంప్రసాద్, రాములు, వంగూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వంగూరు, ఆగస్టు 14; సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌వో సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని తిప్పారెడ్డిపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకట్‌రాములు, మేషక్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 14 : మండలంలోని తుర్కలపల్లి గ్రామానికి చెందిన చిటికెల శ్రీనివాసులు కుమార్తె చిటికెల అక్షిత అనే చిన్నారి వైద్యఖర్చుల నిమిత్తం బుధవారం ఉప్పటచారిబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆదేశాల మేరకు రూ.15వేలు అందజేశారు. భవిష్యత్తులో అమ్మాయి వైద్యఖర్చులకు, చదువుకు ట్రస్టు నుంచి ఆదుకుంటామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు శ్రీశైలంగౌడు, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్, రమేష్, వెంకటయ్య, మల్లేష్, పాల్గొన్నారు.

'కేసీఆర్‌ను అగౌరవపర్చడం తగదు'

వెల్దండ, ఆగస్టు 14 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అగౌరవపర్చే విధంగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరించడం తగదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చల్లా మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికలో ప్రధాన ప్రతిపక్షనేత, కేసీఆర్ పేరును చివరిలో వేసి తమ కుంచితస్వభావాన్ని చాటుకున్నారని మండిపడ్డారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో ఉన్నాడని, ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణ ప్రజలకు ఆయనను దూరం చేయలేరని పేర్కొన్నారు. సమయం వచ్చినప్పుడు ప్రజలే కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని మధుసూదన్ రెడ్డి అన్నారు. సమావేశంలో నాయకులు రవి, అశోక్ తదితరులున్నారు.

పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్‌గా దొడ్ల నర్సయ్య

అచ్చంపేటటౌన్ ,ఆగస్టు 14: తెలంగాణ స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్‌గా దొడ్ల నర్సయ్య యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిధిలోని అంకిరోనిపల్లి గ్రామానికి చెందిన నర్సయ్యను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ క్యాంపు కార్యాలయంలో శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కట్ట అనంత రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.